క్లుప్తంగా

13న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

రామచంద్రపురం: పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో ఈనెల 13వ తేదీన మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు ఏడిదలో 'గడప గడపకూ'

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం ఏడిదలో పర్యటించనున్నట్టు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఒకటో వార్డు వినాయకుని ఆలయం వద్ద నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ ఆశీర్వాదం సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

గేదె పొట్టలో క్యాన్సర్ కణితి తొలగింపు

మండపేట: పాడిగేదె పొట్ట పైభాగంలో పెరుగుతున్న క్యాన్సర్ కణితిని మండపేటలో రాష్ట్ర పశుసంవర్ధక శిక్షణ కేంద్రం వైద్యులు సోమవారం శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఆలమూరు మండలం పెదపళ్లలోని రైతుకు చెందిన ఏడేళ్ల వయస్సు కలిగిన పాడిగేదె పొట్ట పైభాగంలో క్యాన్సర్ కణితి ఏర్పడిందని శిక్షణ కేంద్రం డీడీ కె.కృష్ణమూర్తి తెలిపారు. ఆరు నెలల క్రితం నిమ్మకాయ సైజులో ఉన్న ఈ కణితి ప్రస్తుతం రెండు కిలోలకు పైగా పెరగడంతో శస్త్రచికత్స చేసి విజయవంతంగా తొలగించామన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు రమ్యశ్రీ



రాయవరం: వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాకి రమ్యశ్రీ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం వి.శాంతిసునీత, పీడీ ఎస్.కృష్ణప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన జాతీయస్థాయి ప్రాబబుల్స్‌లో రమ్యశ్రీ ఉత్తమ ప్రతిభను కనబరించిందన్నారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో జరిగే 41వ సబ్ జూనియర్ జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో మన రాష్ట్రం తరఫున రమ్యశ్రీ పాల్గొంటుందని తెలిపారు. రమ్యశ్రీని సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, ఎంపీటీసీలు మండ వెంకటపద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి అభినందించారు.

ఏరియా ఆసుపత్రిలో హెపటైటిస్ బీ టీకాలు

రామచంద్రపురం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో హెచ్ఐవీ బాధితులకు హెపటైటిస్ బీ టీకాలను ఉచితంగా అందజేశారు. ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటిండెంట్ డాక్టర్ వీరభద్రుడు నేతృత్వంలో ఈ టీకాలు వేశారు. అందించారు. డాక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ హెచ్ఐవీ మందులు వాడుతున్న వారికి లివర్ సంబంధింత వ్యాధులు సోకుండా ముందస్తుగా ఈ టీకాలను అందిస్తున్నామన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ చక్రధర్, నర్సింగ్ సూపరింటిండెంట్ జయప్రద, ఏఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ

కపిలేశ్వరపురం: అంగరలో రజక వృత్తిదారులు తమ కులదైవాన్ని కొలుస్తూ బల్లల పండగను సోమవారం వైభవంగా జరుపుకొన్నారు. రజకపేటలోని శ్రీరామాలయం నుంచి వృత్తిదారులందరూ దేవతామూర్తుల స్మరణ చేస్తూ రజక చెరువు వరకూ ఊరేగింపు జరిపారు. గారడీ, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు సందడిగా మారింది. ఆలయం వద్ద పార్వతీ శివ శంకరులకు పూజ చేశారు. చెరువు వద్ద దేవదామూర్తుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో శ్రీరామ రజక సంఘం పెద్దలు, వృత్తిదారులు పాల్గొన్నారు.

82 మందికి దంత వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామచంద్రపురం రూరల్: అన్నాయిపేటలో గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ)ల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ద్రాక్షారామకు చెందిన భీమేశ్వర దంత వైద్యుడు బచ్చు క్రాంతికుమార్ సుమారు 82 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. జబర్దస్త్ ఫేమ్ షేకింగ్ శేషు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పుచ్చకాయలు.. పోషకాలు బోలెడు..

- తమిళనాడు, నెల్లూరు నుంచి దిగుమతి
- ఇతర రాష్ట్రాల్లోనూ విక్రయిస్తున్న కోరుమిల్లి వాసులు
- సుమారు 200 కుటుంబాలకు ఆధారం



రహదారి వెంబడి అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు



కపిలేశ్వరపురం: పచ్చగా నిగనిగలాడే పుచ్చపండు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కంటికి ఇంపుగా నోటికి తీయ్యగా అనిపించే ఈ పండు ఆరోగ్యమే కాదు ఆదాయం కూడా తెచ్చిపెడుతోంది. పుచ్చపండు తమిళనాడు, నెల్లూరు, విజయవాడ ప్రాంతాల్లో ఎక్కువగా పండుతున్నాయి. అక్కడ నుంచి దిగుమతి చేసుకొని ఇక్కడ వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన సుమారు 200 కుటుంబాలు ఈ పుచ్చపండ్ల విక్రయ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు.

పుచ్చపండులో పోషకాలు

పుచ్చపండులో విలువైన పోషకాలు, శరీరానికి కావాల్సిన నీరు లభ్యమవుతాయి. తేలిగ్గా అరగడంతో పాటు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచే బీటా కెరోటిన్, సీ ఈ కే విటమిన్లు, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియంట్లు ఉంటాయి.

పుచ్చకాయల్లో రకాలు

సుగర్‌బేబీ, నాందారి, ఆర్కిమెన్ తదితర రకాలున్నాయి. మొత్తంగా నల్ల, తెల్ల రంగు కాయలుగా పిలుస్తారు. నల్లకాయలు అన్ని కాలాల్లోనూ పండుతాయి. నల్లకాయలు విజయవాడ సమీప ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. తెల్లకాయలు తమిళనాడు, నెల్లూరు ప్రాంతాల నుంచి తెస్తారు. వేసవిలోనే పండుతుంది. నల్లకాయ సుమారు 3 కేజీలుండగా కేజీ రూ.20 చొప్పున అమ్ముతుతున్నారు. తెల్లకాయ సుమారు 15 కేజీలు వరకూ ఉంటుంది కేజీ రూ.25 చొప్పున అమ్ముతున్నారు.

రాష్ట్ర వ్యాప్త విక్రయాల్లో కోరుమిల్లి వాసులు

పుచ్చపండు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో రహదారుల పక్కన విక్రయాలు చేస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రాయవరం, పసలపూడి, మాచవరం, మండపేట, ద్వారపూడి, కాజులూరు ప్రధాన రహదారుల్లో పెద్ద విక్రయ దుకాణాలున్నాయి. పుచ్చకాయల వ్యాపారంలో కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామస్తులది ప్రత్యేకత. పెద్ద కోరుమిల్లికి చెందిన వారు హైదరాబాద్, ఒడిశా, కర్ణాటక, విజయవాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. అదే గ్రామ శివారు చిన్నకోరుమిల్లికి చెందిన వారు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కాకినాడ, యానాం, అమలాపురం, అనకాపల్లి, పెందుర్తి, కొత్తవలస, సాలూరు, విజయనగరం, ప్రాంతాల్లో పుచ్చకాయల దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఆయా వ్యాపారాల్లో గ్రామానికి చెందిన సుమారు 200 కుటుంబాలు ఆధారపడుతున్నాయి.

వేసవి మంచి సీజన్



వేసవిలో పుచ్చకాయలను అమ్ముతాం. వినియోగదారునికి రుచి, ఆరోగ్యం గ్యారంటీగా దొరుకుతుంది. తమిళనాడు, నెల్లూరు, విజయవాడ ప్రాంతాల నుంచి పుచ్చకాయలను ఖరీదు చేసి తెస్తాం. ఒక్కోసారి మంచి లాభాలు వస్తుండగా కొన్ని సార్లు నష్టాలు కూడా భరిస్తుంటాం. పది లోడుల్లో రెండు నుంచి మూడు లోడుల్లోని కాయలు దెబ్బతిని వస్తుంటాయి. వినియోగదారుల ఆదరణ వల్ల ప్రస్తుతం వ్యాపారం సజావుగా సాగుతోంది.

– తుట్టుపు వీరబాబు, చినకోరుమిల్లి, కపిలేశ్వరపురం మండలం

ఆరోగ్యానికి మంచిది



పుచ్చపండు ఆరోగ్యానికి మంచిది. 91 శాతం నీటితో నిండిన 100 గ్రాముల పుచ్చ పండులో 46 కేలరీల శక్తిని శరీరానికి అందిస్తుంది. 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 26 మిల్లీ గ్రాముల విటమిన్ ఏ, 170 మిల్లీగ్రాముల పొటాషియం, 12 మిల్లీ గ్రాముల విటమిన్ సీ, 0.1 మిల్లీ గ్రాముల బీ6, 0.6 గ్రాముల ప్రొటీన్, 0.4 గ్రాముల ఫైబర్ ఉంటాయి. కొలెస్ట్రాల్, ఫ్యాట్, సోడియంలు పెద్దగా ఉండకపోవడంతో అనారోగ్యాన్ని కలిగించదు.

– డాక్టర్ జి.అనూజ ప్రియాంక, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం

పురుగు మందులు అధికమైతే అనర్థమే



అముజూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవి తదితరులు

కె.గంగవరం: రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు వాడకూడదని, వాడితే పంటలకు నష్టమని స్థానిక వ్యవసాయ శాఖ ఏఓ బి.రవి సూచించారు. మండల పరిధిలోని అముజూరులో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు ప్రస్తుతం ఎటువంటి తెగుళ్లు, పురుగులు లేవని గమనించామన్నారు. ఇలాంటి సమయంలో రైతులు సాంప్రదాయం ప్రకారం ఎరువులు, పురుగు మందులు వాడకుండా పెట్టుబడి ఖర్చుని తగ్గించుకోవాలని తెలిపారు. దీంతో పాటు ప్రస్తుతం రైతులు వేసిన పంటను ప్రతి గ్రామ సచివాలయాల్లో పంటను నమోదు చేసుకోవాలని తద్వారా జరిగే లాభాలను గురించి రైతులకు వివరించారు. టార్పాలిన్లు కావల్సిన రైతులు గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద నమోదు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్సిడీపై వాటిని అందిస్తామన్నారు. గ్రామ పెద్దలు పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్, కొరపాటి రవి, గ్రామ వ్యవసాయ సహాయకులు అర్జమ్మ స్థానిక రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరాననడం అవాస్తవం

కాజులూరు: తాను టీడీపీలో చేరానంటూ మండల గ్రామాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని జగన్నాథగిరి ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాళ్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో ఆయన విలేకురులతో మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన ఒక టీడీపీ సమావేశంలో తన వర్గీయులతో కలసి తాను ఆ పార్టీలో చేరానంటూ దుష్ప్రచారం జరుగుతుందన్నారు. గతంలో ఎమ్మెల్సీ తోట త్రీమూర్తులు కార్యకర్తగా పనిచేసిన తాను అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయనతో పాటుగా తన వర్గీయులతో కలసి వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. గత ఏడాది క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలోనూ తాము వైఎస్సార్ సీపీకి పని చేశామన్నారు. అయితే ఇటీవల గ్రామంలోని స్థానిక రాజకీయాలలో తలెత్తిన విబేదాలు కారణంగా పార్టీలకు కొంచం దూరంగా తటస్థంగా ఉంటున్నామన్నారు. తాను, తన వర్గీయులు ఏ పార్టీలోనూ చేరలేదన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న పండితులు

మండపేట: ఏడిద శ్రీవాసవి ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి వేంకటేశ్వరస్వామివారి కల్యాణ వేడుక కన్నుల పండువగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ వేడుకకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తొలుత సాయంత్రం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ దేవేరులతో హంసవాహనంపై స్వామివారి శోభాయాత్ర ఘనంగా జరిగింది. అనంతరం పారిశ్రామికవేత్త కొనగళ్ల సత్యనారాయణ, విజయకుమారి దంపతులు యాజమాన్య దంపతులుగా స్వామివారి కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంగర వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు కె బాలాజీఆచార్యులు నేతృత్వంలో నిర్వహించిన వేడుకలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, ఫంక్షన్‌హాల్ కమిటీ చైర్మన్ పసుమర్తి సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు నేడు భూమిపూజ

రాయవరం: సోమేశ్వరంలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీఏ సబ్‌స్టేషన్ పనులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం భూమిపూజ చేయనున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ ఆరిఫ్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు సబ్‌స్టేషన్ భూమిపూజ అనంతరం రహదారులు, రుద్రభూమి, సోమగుండం చెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

రైతులు అధైర్యపడొద్దు

మంత్రి చెల్లుబోయిన వేణు భరోసా



కుడుపూరులో పంట పొలాలను పరిశీలిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: సాగునీరు విషయంలో రైతులు అధైర్యపడొద్దని ప్రతి ఒకరానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని కుడుపూరు–శివల గ్రామాల్లో సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. కుడుపూరు ప్రాంతంలో సుమారు 80 ఎకరాలకు సాగునీరు పూర్తిగా అందడం లేదని సర్పంచ్ పిల్లి రాంబాబు మంత్రి వేణు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో మంత్రి వేణు పంట పొలాలను పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. వెంటనే ఆ పొలాలకు సారునీరు అందేలా మోటార్లను ఏర్పాటు చేయాలన్నారు. సాగునీరు తొడడానికి అవసరమయ్యే ఖర్చు గురించి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేసిందని రైతులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు సాగునీరు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇరిగేషన్ డీఈ వి.రామకృష్ణ, ఎంపీపీ నాగమణి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ, తహసీల్దార్ వైద్యనాథశర్మ, సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, అనుసూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు

- ప్రజల్లో చర్చించేందుకు కార్యాచరణ
- మండల పరిషత్ సమావేశంలో మంత్రి వేణు గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో విప్లవాత్మ మార్పులు తెచ్చారని, వాటిపై ప్రజల్లో చర్చించేలా ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ నూతన పంథాలో కార్యాచరణ రూపొందించనున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన సోమవారం జరిగిన రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశంలో మంత్రి వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన మూడున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో మాటలతో మభ్యపెట్టి పాలన సాగిస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాలనను సచివాలయ, వలంటీరు వ్యవస్థల ద్వారా ప్రజల ఇంటి ముంగిటకు చేర్చారన్నారు. దీనిపై నాటి పాలన, నేటి పాలన, నాటి ప్రభుత్వ విద్య, నేటి ప్రభుత్వ విద్య, నాటి ఆసుపత్రులు, నేటి ఆసుపత్రులు, నాటి వ్యవసాయం, నేటి వ్యవసాయం తదితర అంశాల్లో బేరీజు వేస్తూ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంతా కలసి రోజుకొక గ్రామంలో ప్రజలతో కలసి చర్చించేలా ప్రత్యేక కార్యక్రమం మొత్తం రాష్ట్రానికి మన నియోజకవర్గం మార్గదర్శకం కావాలన్నారు. దీనికోసం ప్రజా ప్రతినిధులు అంతా సిద్ధంగా ఉండాలని మంత్రి వేణు పిలుపునిచ్చారు. అనంతరం శాఖ వారీగా చేపట్టిన కార్యక్రమాల స్థితిగతులపై మండల స్థాయి అధికారులు సమావేశానికి వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుల ఉన్నతే సీఎం లక్ష్యం

మంత్రి వేణును కలిసి కృతజ్ఞతలు తెలిపిన శెట్టిబలిజ సంఘం నేతలు

రామచంద్రపురం: సామాన్యులు సైతం విదేశీ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరుకునే మనస్సున్న మంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విదేశీ విద్యాదీవెన ద్వారా ఉన్నత చదువులు అవకాశం కల్పించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండలం తాళ్లపొలంకు చెందిన టేకుమూడి నిరోషా దేవి విదేశీ విద్యా దీవెనకు ఎంపికైన సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన శెట్టిబలిజ సంఘం నేతలు మంత్రి వేణును కలిసి కృతజ్ఞతలు తెలియజేసి, ఘనంగా సత్కరించారు. మంత్రి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు తాళ్లపొలం సర్పంచ్ కట్టా గోవిందు, ఎంపీటీసీ సభ్యుడు సత్యానందం, ఏజీపీ పిల్లి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా డీఈసీ మాత్రల పంపిణీ

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలో డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయాలని పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బందికి వైద్యాధికారి పీఏఎస్ఎస్‌డీ రత్నకుమారి ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం మాత్రల పంపిణీపై ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 10వ జాతీయ ఫైలేరియా దినోత్సవం సందర్భంగా ఈనెల 10న మాత్రల పంపిణీ ప్రారంభించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, రెండేళ్లలోపు పిల్లలతో మాత్రలను మింగించొద్దని అన్నారు. డీఈసీ మాత్రలను 2 నుంచి 5 ఏళ్ల గల వారికి ఒక మాత్ర, 6 నుంచి 14 ఏళ్ల వారికి రెండు మాత్రలు, 15 ఏళ్ల పైబడిన వారితో 3 మాత్రలు మింగించాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను రెండేళ్ల పైబడిన ప్రతి ఒక్కరి చేత ఒకటి మాత్రమే మిగిందచాలన్నారు. మాత్రను వేసుకునే ముందు చేతులను పరిశుభ్రం చేసుకోమని జాగ్రత్తలు చెప్పాలని రత్నకుమారి ఆదేశించారు. సమావేశంలో హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ పెమ్మరాజు సురేష, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలకు ఊపిరి పోసింది జగనన్న

- మంత్రి వేణు గోపాలకృష్ణ
- శీలలో గడప గడపకూ మన ప్రభుత్వం



శీల గ్రామంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: టీడీపీ నాయకుల అబద్ధపు హామీలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన రాజకీయాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరిపోశారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శీల గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతుందీ లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు 600 వరకూ హామీలిచ్చి ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్ నిలబెట్టుకున్నారని తెలిపారు. వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఎంతెంత లబ్ధిచేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాలు వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. పలువురు స్థానిక సమస్యలను ప్రజలు మంత్రి వేణుగోపాల కృష్ణ దృష్టికి తీసుకరాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసి సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, కంచి ఏసునందం, యాళ్ల సత్తిబాబు, దొమ్మేటి కొండ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

8న మండల పరిషత్ సమావేశం

కాజులూరు: ఈ నెల ఎనిమిదో తేదీన జరుగనున్న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరుగు ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు.

కౌలురైతు సంఘం నేతల ఆందోళన

కాజులూరు: రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కౌలురైతు సంఘం నాయకులు సోమవారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ చాలా మొసపూరితంగా ఉందన్నారు. గత సంవత్సరం వ్యవసాయానికి ఇచ్చే బడ్జెట్‌తో పోల్చితే ఈ ఏడాది ఒక్క ఎరువుల సబ్సిడీపైనే 50 వేల కోట్ల కోత పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌పై మరో సారి పునఃపరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు కొప్పుశెట్టి సర్వేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, చొల్లంగి రామకృష్ణ, పెద్దింశెట్టి నాగేశ్వరరావు, కేత అన్నవరం, వెంకటరమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి



అప్పలాచార్యను సత్కరిస్తున్న మండపేట స్వర్ణకార సంఘం నాయకులు

మండపేట: జిల్లాలోని స్వర్ణకారుల సంక్షేమానికి, సంఘ బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల అప్పలాచార్య పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన అప్పలాచార్యను సోమవారం మండపేటలో పట్టణ స్వర్ణకార సంఘం నాయకుడు నరిగిరి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా విశ్వకర్మలకు అందే పథకాలన్ని అర్హులైన వారందరికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ నేత కోన సత్యనారాయణ, సంఘ నాయకులు జేసీ ప్రసాద్, టేకి శ్రీను, ఒంపోలు పోలరాజు, నరిగిరి బాపయ్య, లంగోజు కృష్ణమోహన్, వి.నాగేశ్వరరావు, పట్నాల రుద్రయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనలక్ష్మి అమ్మవారి జాతర

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శివారు కుందాలమ్మ చెరువు గ్రామ దేవత ధనలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుడుపూడి వారి పుట్టింటి ఆడబడుచులు సారె, చీరలు, నైవేద్యాలు సమర్పించారు. తీన్‌మార్ డప్పులు, రాత్రి మ్యూజికల్ ప్రోగ్రాంలు నిర్వహించారు. సోమవారం 150 సంవత్సరాలైన సందర్భంగా రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, రవికుమార్ దంపతులు, గ్రామ పెద్ద అనుసూరి వెంకటరమణ, గ్రామ పెద్దల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

కరాటే పోటీల్లో ద్రాక్షారామ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 5వ తేదీన కాకినాడలో జరిగిన రెండో ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో ద్రాక్షారామకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించినట్టు కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణ తెలిపారు. సీనియర్ స్పారింగ్ విభాగంలో జి.కిరణ్, ఎ.పరిశుద్ధు, జి.ఆంజనేయులు, ఎ.సంతోష్ ప్రథమ స్థానంలోను, జూనియర్ విభాగంలో జి. అభిరామ్, జి.వినయ్‌దుర్గ ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ బాలకృష్ణను గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు తదితరులు అభినందించారు.